# బొగ్గు గనుల ప్రైవేటీకరణ మానుకోవాలి

- లేకుంటే ఉద్యమాలు, పోరాడి కాపాడుకుంటాం
- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్

కాసిపేట, జూన్ 18 : తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు గనులను టెండర్ల ద్వారా ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ ఒక ప్రకటనలో ఖండిస్తూ ఈ విధానాన్ని వెంటనే మానుకోవాలన్నారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే ఇవ్వాలని, గనులన్నింటినీ ప్రైవేట్ వారికి ఇస్తే సింగరేణిలో సుమారు 42,000 మంది కార్మికులు, అధికారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా రామగుండం వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రులు కిషన్‌రెడ్డి సింగరేణిలో జోక్యం చేసుకోబోమని, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51% కాబట్టి సింగరేణి ప్రైవేటుపరం చేయబోమని చెప్పిన నాయకులు ఎన్నికల అనంతరం ఇప్పుడు కేంద్రంలో బొగ్గు శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి వెంటనే సింగరేణిలోని బొగ్గు బావులను వేలం పాట వేసి బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మానుకోవాలని, సింగరేణి సంస్థకే ఇవ్వాలని, లేదంటే బొగ్గు గనుల కోసం సింగరేణి కార్మికులు, ఏఐటీయూసీ పోరాటాలు, ఉద్యమాలు చేసి ఈ బొగ్గు గనులను కాపాడుకుంటామని, ఏఐటీయూసీ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు.

# ఈపీ ఆపరేటర్ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ప్రారంభం


మందమర్రి : డ్రైవింగ్ టెస్ట్‌ను ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

మందమర్రి, జూన్ 18: సింగరేణి మందమర్రి ఏరియాలో ఈపీ ఆపరేటర్ ట్రెయినీ, డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ప్రారంభమయ్యింది, స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ జెండా ఊపి టెస్ట్‌ను ప్రారంభించారు. ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు మందమర్రి, బెల్లంపల్లి ఏరియా నుంచి 187 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 10 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 90 మందికి డ్రైవింగ్ అర్హత పరీక్ష నిర్వహించారు. అందులో 46 మంది ఉత్తీర్ణత సాధించగా 44 మంది ఉత్తీర్ణత సాధించలేక పోయారు. మిగతా 87 మందికి బుధవారం ఉదయం 6 గంటల నుంచి డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ నెల 30న కొత్తగూడెంలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, డీవైజీఎం(కార్పొరేట్) సంతోశ్, ఐఈడీ రాజన్న, కేకేఓసీ ఇంజినీర్ సూర్యనారాయణ రాజు, పీఎం శ్యాంసుందర్, ఎస్ఈ వర్క్‌షాప్ నాగరాజు, డీవైపీఎం సత్యబోస్, ఏఎస్వో రవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ ఏరియాలో..**

శ్రీరాంపూర్, జూన్ 18 : సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉద్యోగోన్నతి పొందడానికి ఈపీ ఆపరేటర్ నియామక పరీక్షలు అవకాశమని శ్రీరాంపూర్ ఎస్వోటూజీఎం, ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షల కన్వీనర్ వీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించిన ఈపీ ఆపరేటర్ నియామక ప్రాక్టికల్ పరీక్షలను పురుషోత్తంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉద్యోగోన్నతి పొందాలని కోరారు. 135 మందికి గాను 124 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 65 మంది రాత పరీక్షకు ప్రాక్టికల్ పరీక్షల ద్వారా అర్హత సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరీక్షల పర్యవేక్షణ అధికారి అజయ్‌కుమార్, సభ్యులు ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, రాజేశ్వర్‌రావు, డీజీఎం రవీందర్, సర్వే ఆఫీసర్ వెంకటేశం, ఎస్ఈ కిరణ్ కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీవోలు గౌస్ పాషా, కాంతారావు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో టెస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి

# విధులను నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

- డ్యూటీకి రాకుండా మస్టర్ పడితే చర్యలు
- అటెండెన్స్ పడ్డాక ఆఫీసు దాటితే ఉపేక్షించేది లేదు
- క్రమశిక్షణ, సమయ పాలన పాటించని ఉద్యోగులు, అధికారులపై కఠిన చర్యలు
- పని ప్రదేశాలను అధికారులు తనిఖీ చేయాలి
- సీఎండీ బలరాం ఆదేశం


సీఎండీ ఎన్ బలరాం

శ్రీరాంపూర్, జూన్ 18 : సింగరేణిలో ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించిన సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ ఇప్పుడు కంపెనీలో పని సంస్కృతిని పెంచేందుకు కీలక చర్యలు తీసుకుంటున్నారు. గనులు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు డ్యూటీలకు రాకున్నా మస్టర్ పడుతున్నట్లు.. మరి కొందరు మస్టర్ పడి బయటకు వెళ్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సీఎండీ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సింగరేణిలో ఉద్యోగులు, అధికారులు కూడా ఇకపై రోజూ తప్పని సరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేసుకోవాలని, దీనిపై ఆయా ఏరియాల జీఎంలు విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. భోజన విరామం పూర్తయిన తర్వాత నిర్ణీత సమయంలో మళ్లీ సీట్లలో కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లంచ్ బ్రేక్‌లో చాలా మంది 3 గంటల పాటు విరామం తీసుకోవడం ద్వారా తమ పనులు, ఫైల్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పలువురు సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన సెక్యూరిటీ విభాగం ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. గతంలో సింగరేణి దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు రాకపోతే మెమోలు జారీ చేసిన సీఎండీ ఇప్పుడు సమయ పాలనను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగరేణిలోని ప్రతీ ఉద్యోగి, అధికారి కచ్చితమైన సమయ పాలన పాటించాలని, డ్యూటీలో చేరిన తర్వాత బయటకు వెళ్లడం, పనిచేయకుండా కూర్చోవడం వంటి విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు ఎనిమిది గంటలు పనిచేస్తున్నారని, వారికి సంబంధించిన సంక్షేమం, ఇదతరాత్ర పనులను నిర్వర్తించే ఉద్యోగులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగులు ఏదో ఒక కారణంతో వరండాల్లో తిరగడం, బయటికి వెళ్లడం, కబుర్లతో కాలక్షేపం చేస్తే సంబంధిత విభాగాధిపతులపై చర్యలు ఉంటాయన్నారు. దీనిపై నిఘా విభాగం నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నామని తెలిపారు. సింగరేణి వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోకి అడుగులు పెడుతున్నదని, కంపెనీ ఉత్పాదకత పెరగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందులో ఉద్యోగులు, అధికారులు క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించడం అత్యవసరమన్నారు. ఎక్కువ మంది కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సంస్థ పట్ల అభిమానం, అంకిత భావంతో పని చేస్తున్నారని అభినందించారు. కొందరు మాత్రం విధులకు గైర్హాజరవుతూ, మస్టర్ పడికూడా బయటకు వెళ్లడం లేదా డ్యూటీలో ఉండి కూడా పనిచేయకుండా ఉంటున్నారని ఆరోపనలున్నాయని తెలిపారు. వీరి ప్రభావం ఇతర ఉద్యోగులపై పడే అవకాశం ఉందన్నారు. పని సంస్కృతిని దెబ్బతీస్తే యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అవసరమైతే క్రమశిక్షణ లేని ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

**కార్పొరేట్‌లో 32 మంది ఆలస్యంగా ..**

సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సింగరేణి సెక్యూరిటీ విభాగం మంగళవారం ఉదయం కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఆఫీసులో ఉద్యోగులు విధులకు వచ్చే సమయాన్ని, భోజనానికి వెళ్లే సమయాలను రికార్డు చేశారు. ఆలస్యంగా వచ్చిన 32 మంది ఉద్యోగల వివరాలను సంబంధిత శాఖలకు పంపించారు. ఆయా విభాగాల అధిపతులు వారిని మందలించారు. ఇకపై నిరంతర ప్రక్రియగా సమయ పాలనను నమోదు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల పని తీరును పరిశీలించేందుకు అన్ని ఏరియాల జీఎం కార్యాలయాలు, గనుల్లో ఆకస్మికంగా తనిఖీ చేయాలని జీఎంలను ఆదేశించారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి


శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో మొక్కలు నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 18 : మొక్కలు నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి మైదానంలో మంగళవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఉద్యోగులందరూ భావితరాలకు మంచి వాతావరణ అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరుతూ స్వచ్ఛమైన గాలి, నీరు అందరికీ అవసరమన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఉద్యోగుల సౌకర్యార్థం కావాల్సిన అన్ని సదుపాయాలను సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్నదన్నారు. వీటిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీవైజీఎం(పర్సనల్ కార్పొరేట్ అజయ్‌కుమార్, శ్రీరాంపూర్ ఏరియా డీవైజీఎం అరవిందరావు, డీజీఎం రవీందర్, సర్వే ఆఫీసర్ వెంకటేశం, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఓసీపీ వోల్వా ఈపీ ఆపరేటర్ల సమ్మె

- అకారణంగా డ్రైవర్ల తొలగింపుపై నిరసన
- క్యాంపులోని ఆంధ్రా డ్రైవర్లతో సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర చేస్తున్నారని ఆరోపణ

శ్రీరాంపూర్, జూన్ 18 : శ్రీరాంపూర్ ఓసీపీ మట్టి తవ్వకాలు రవాణా(ఓబీ) చేస్తున్న సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థ 15 మంది డ్రైవర్లను అకారణంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తోటి డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థలో పనిచేస్తున్న సింగాపూర్ భూనిర్వాసిత కాంట్రాక్టు డ్రైవర్లను 15 మందిని వారి విధులను కాదని వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్ పనులకు వినియోగించడాన్ని డ్రైవర్లు ప్రశ్నించినందుకు కాంట్రాక్టు సంస్థ వారిని పనుల నుంచి తొలగించింది. ఈ విషయంపై మంగళవారం భూనిర్వాసిత ఓల్వా డ్రైవర్స్ సీఆర్ఆర్ మేనేజర్లు శ్రీనివాస్, సురేశ్‌రెడ్డిని ప్రశ్నించారు. దీంతో వారు సరైన సమాధానం చెప్పక పోవడంతో యాజమాన్య వైఖరిని నిరసిస్తూ తోటి డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. క్యాంపులోని ఆంధ్రా ప్రాంత డ్రైవర్లచే మట్టి రవాణా చేయించడం, కార్మికులను తొలగించడాన్ని సింగాపూర్ భూనిర్వాసిత కాంట్రాక్టు డ్రైవర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. వోల్వా, ఈపీ ఆపరేటర్ డ్రైవర్లుగా పనిచేయాల్సిన వారితో వాటర్ ట్యాంకులు నడిపించడం సరికాదని వ్యతిరేకిస్తున్నామన్నారు. అకారణంగా తొలగించిన డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు సంస్థ భూనిర్వాసిత డ్రైవర్లు, కార్మికులపై వివక్ష చూపుతూ ఆంధ్రా ప్రాంత కార్మికులతో పని చేయిస్తూ తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. వెంటనే భూనిర్వాసిత డ్రైవర్లకు న్యాయం చేయాలని, జీఎం చొరవ తీసుకొని నిర్వాసిత డ్రైవర్లను కొనసాగించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను ఉధృతం చేసి ఉత్పత్తిని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

# మద్యం మత్తులో కొట్టుకున్న సోదరులు

- తలకు తీవ్రగాయమై తమ్ముడు మృతి


విజయ్ (ఫైల్)

సీసీసీ నస్పూర్, జూన్ 18 : మద్యం మత్తులో సోదరులు కర్రలతో కొట్టుకోగా, తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సీసీసీ నస్పూర్ గాంధీనగర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. గాంధీనగర్‌కు చెందిన కుంచం రాజం, రాజమ్మ దంపతులకు ఆరుగురు కుమారులు. కొన్ని రోజుల క్రితం తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. చిన్న కుమారులైన రాము, విజయ్(22)లకు ఇంకా పెళ్లి కాలేదు. నిత్యం కూలీ పనులకు వెళ్లడం.. ఆపై మద్యం తాగి గొడవలు పెట్టుకోవడం వీరికి పరిపాటిగా మారింది. ఎప్పటిలాగే సోమవారం రాత్రి అన్నదమ్ములిద్దరూ అతిగా మద్యం తాగారు. సీసీసీ రాయల్ టాకీస్ ఏరియాలోని వైన్స్ వద్ద ఓ వ్యక్తితో గొడవ పడ్డారు. ఆపై గాంధీనగర్ నూర్ మసీద్ సమీపంలోని కబ్రస్తాన్ వద్దకు వచ్చారు. ఆ సమీపంలో ఇద్దరు కలిసి భోజనం చేస్తూనే గొడవ పడ్డారు. ఒకరినొకరు కర్రలతో కొట్టుకున్నారు. రాము, తమ్ముడు కుంచం విజయ్ తలపై కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం రాము ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కబ్రస్తాన్‌లో రోడ్డు పనులు చేయిస్తున్న గఫార్‌కు విజయ్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ ఆకుల అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగితెలుసుకున్నారు. రామును అదుపులోకి తీసుకున్నారు.అతడి ముఖం పై గాయం ఉండగా, దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# తమ్ముడిపై అన్న కత్తితో దాడి

మంచిర్యాల ఏసీసీ, జూన్ 18 : మంచిర్యాలలోని ఎల్ఐసీ కాలనీలో నివాసముండే అన్నదమ్ముళ్లు మిట్ట రాజేందర్, మిట్ట సుజిత్ మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోటుకు దారి తీసిందని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు అన్నదమ్ములు బైక్ మెకానిక్‌లుగా పని చేస్తున్నారు. కొద్ది రోజులగా అన్న రాజేందర్ డబ్బులను తమ్ముడు సుజిత్ ఎత్తుకెళ్లాడని ఇద్దరి మధ్య వివాదం నడుస్తున్నది. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు కలిసి మద్యం సేవించిన అనంతరం గొడవ పడ్డారు. ఈ క్రమంలో సుజిత్ గొంతుపై కత్తితో అన్న రాజేందర్ పొడవడంతో తీవ్రగాయమైంది. సుజిత్ ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ తెలిపారు.

# గాలివాన బీభత్సం

జైనూర్/చెన్నూర్ రూరల్, జూన్ 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. జైనూర్ మండలం పానాపటార్ గ్రామ పంచాయతీ పరిధిలోగల గోలేటినగర్‌లో ఈదురు గాలులకు ఆత్రం లక్ష్మణ్‌రావ్, వినాయకరావ్ ఇంటిపై కప్పు రేకులు, పెంకలు గాలికి లేచిపోయాయి. విద్యుత్ స్తంభం విరిగి ఇళ్లపై పడింది. ఇంట్లోని సామగ్రి తడిసి ముద్దయ్యింది. రూ. 30 వేల విలువైన విత్తనాలు, ఎరువులు తడిసి నష్టపోయాయి. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం ఆస్నాద్, రచ్చపల్లి, బీరెల్లి, నాగాపూర్, సోమన్‌పల్లి, కొమ్మెరలో ఈదురుగాలుతో కూడిన వర్షం పడింది. ఆస్నాద్ ప్రధాన రహదారిలో ఉన్న చెట్లు విరిగి రోడ్డు మీద పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇంగిలి జనార్ధన్, బాపగౌడ్ ఇంటిముందు ఉన్న రేకులు గాలికి లేచిపోయినాయి. కిష్టంపేటలో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్ల మీద పడ్డాయి.

